
- ఎస్సీ వర్గాలకా? జనరల్ వర్గాలకా?
- ఎస్సీ వర్గాలకు మూడు జడ్పీటీసీ స్థానాలు
- ఎస్సీలకు కేటాయిస్తే పాలకుర్తి, ధర్మారం, జూలపల్లిలో తీవ్రం కానున్న పోటీ



జడ్పీ చైర్మన్ పదవిపై ఉత్కంఠ

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కాగా, పెదపల్లి జిల్లా చైర్మన్ పదవి ఏ వర్గానికి దక్కనున్నదనే ఉత్కంఠ మొదలయ్యింది. ఇవేగాకుండా సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు ఏ వర్గానికి చెందిన వారికి రిజర్వు అయ్యాయనే విషయమై రాజకీయ వర్గాల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతున్నది. జిల్లాలో గల ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాల రిజర్వేషన్లకు స్పందించి ఈనెల 24వ తేదీన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన కథనంపై కూడా జిల్లాలో చర్చ జరుగుతున్నది. రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు ఖరారు చేస్తున్న దృష్ట్యా పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఏ వర్గానికి దక్కుతుందనే చర్చ జరుగుతున్నది. 2019లో జరిగిన ఎన్నికల్లో చైర్మన్ స్థానం బీసీ జనరల్‌కు కేటాయించగా, ఈసారి ఎస్సీలకు గానీ, జనరల్‌కు గానీ కేటాయించాల్సి ఉంది. ఆ సమయంలో రాష్ట్రంలో గల 32జడ్పీల్లో 5సీట్లను ఎస్సీలకు కేటాయించారు. 16స్థానాలను జనరల్‌కు కేటాయించారు. జడ్పీచైర్మన్ల రిజర్వేషన్లను రాష్ట్రస్థాయిలో పంచాయతీరాజ్ కమిషనర్ ఖరారు చేయనున్నారు. 2011జనాభా లెక్కల ప్రకారం మండల, జిల్లా పరిషత్‌ల పరిధిలోని మొత్తం జనాభా, జిల్లా ఎస్సీల జనాభాతో లెక్కించగా వచ్చే శాతాన్ని పైనుంచి కిందకు వరుసక్రమంలో జిల్లాలను చేరుస్తారు. రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు ఖరారు చేస్తుండడంతో మొదటి 5జిల్లాలను మినహాయించి ఆ తర్వాత 5జిల్లాల జడ్పీచైర్మన్ పదవులను ఎస్సీలకు కేటాయించనున్నారు. జిల్లాలో గ్రామీణప్రాంతాల్లో ఉన్న మొత్తం జనాభాలో ఎస్సీలు 19.14శాతం ఉన్నారు. ఎస్సీ జనాభాలో పెద్దపల్లి జిల్లా మొదటి 10స్థానాల్లో ఉంటే మాత్రం తప్పరిసరిగా ఎస్సీ వర్గాలకు చైర్మన్ పదవిని ఖరారు చేయనున్నారు. లేదంటే జనరల్‌కు కేటాయించే అవకాశాలున్నాయి.

• జడ్పీ చైర్మన్ ఎస్సీలకు కేటాయిస్తే ఆ 3మండలాల నుంచే పోటీ..

జడ్పీ చైర్మన్ పదవి ఎస్సీలకు రిజర్వు చేస్తే మాత్రం పాలకుర్తి, జూలపల్లి, ధర్మారం మండలాల నుంచి గెలుపొందే జడ్పీటీసీల్లో ఎవరో ఒకరు జడ్పీ చైర్మన్ పదవిని దక్కించుకోనున్నారు. దీంతో ఈ మూడు స్థానాల్లో గట్టి పోటీ ఉంటుంది. అధికార

(మిగతా 8వ పేజీలో)

• ఎస్సీలకు మూడు జడ్పీటీసీ స్థానాలు..

జిల్లాలో గల 13గ్రామీణ మండలాల్లో కోటా ప్రకారం 3స్థానాలను ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వారికి రిజర్వు చేయనున్నారు. 2011జనాభా లెక్కల ప్రకారమే ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఖరారు చేస్తున్న దృష్ట్యా జిల్లాలో 3స్థానాలు రిజర్వు అవుతున్నాయి. జిల్లాలోని మంథని మండలంలో 29.42 శాతం, అంతర్గాం మండలంలో 26.62శాతం, ఎలిగేడు మండలంలో 24.85శాతం, పాలకుర్తి మండలంలో 22.82శాతం, జూలపల్లి మండలంలో 21శాతం, ధర్మారం మండలంలో 20.50శాతం, సుల్తానాబాద్ మండలంలో 20.31శాతం, పెద్దపల్లి మండలంలో 18.54శాతం, కాల్వశ్రీరాంపూర్ మండలంలో 17.52శాతం, రామగిరి మండలంలో 17.27శాతం, కమాన్‌పూర్ మండలంలో 16.22 శాతం, ఓదెల మండలంలో 16.21శాతం, ముత్తారం మండలంలో 12.55శాతం షెడ్యూల్ కులాలకు చెందిన వారి జనాభా ఉంది. 2019లో జరిగిన ఎన్నికల్లో మంథని, అంతర్గాం, ఎలిగేడు మండలాలను ఎస్సీ వర్గాలకు కేటాయించారు. ఈసారి ఆ వరుసలో పాలకుర్తి, జూలపల్లి, ధర్మారం మండలాల స్థానాలు ఎస్సీలకు రిజర్వు అవుతున్నాయి. అలాగే గత ఎన్నికల్లో ఎంపీపీ స్థానాల్లో మంథని, అంతర్గాం మండలాలను ఎస్సీ వర్గాలకు కేటాయించగా, ఈసారి ఎలిగేడు, పాలకుర్తి, జూలపల్లి, ధర్మారం మండలాలు ఎస్సీ వర్గాలకు కేటాయించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించినా, మొత్తంగా 50శాతానికి మించకుండా రిజర్వేషన్లు కల్పించినా కూడా ఎస్సీస్థానాల్లో ఎలాంటి మార్పులు చేర్పులు ఉండవు. కేవలం బీసీ, జనరల్ స్థానాలే అటు, ఇటుగా మారనున్నాయి.

ఎన్టీపీసీ గుర్తింపు ఎన్నికల్లో.. బీఎంఎస్ ఘన విజయం

● ఐఎన్‌టీయూసీకి రెండో స్థానం



విజయోత్సవాలలో బీఎంఎస్ నాయకులు

జ్యోతినగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గురువారం జరిగిన రామగుండం ఎన్టీపీసీ గుర్తింపు కార్మికసంఘం ఎన్నికల్లో బీఎంఎస్ అనుబంధ ఎన్టీపీసీ కార్మిక సంఘ్ ఘన విజయం సాధించింది. ప్రత్యర్థి ఐఎన్‌టీయూసీ అనుబంధ మజ్దూర్ యూనియన్‌పై 8ఓట్ల తేడాతో బీఎంఎస్ గెలుపొందింది. పోటీలో ఉన్న సీఐటీయూ కేవలం 12ఓట్లను నమోదుచేసింది. మొత్తం 212 ఓట్లకు గాను(ఉద్యోగులు) 98శాతంతో 208ఓట్లుపోలయ్యాయి. బీఎంఎస్‌కు 102ఓట్లు (49శాతం), ఐఎన్‌టీయూసీకి 94ఓట్లు(45శాతం), సీఐటీయూకు 12 ఓట్లు (5శాతం) వచ్చాయి. గెలిచిన బీఎంఎస్‌కు 60శాతం ఓట్లు రాకపోవడంతో 2ఎన్‌బీసీ (జాతీయ ద్వైపాక్షిక సంఘం) సభ్యులను దక్కించుకోలేకపోయింది. బీఎంఎస్‌కు ఒక ఎన్‌బీసీ సభ్యత్వం, రెండోస్థానంలో నిలిచిన ఐఎన్‌టీయూసీ ఒక ఎన్‌బీసీసభ్యత్వం లభించినట్లు ఎన్నికలఅధికారి,ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్ఆర్) విజయ్‌కుమార్ సిక్దర్ ప్రకటించారు. గుర్తింపుయూనియన్‌గా బీఎంఎస్ మూడేళ్లపాటు (2028వరకు) కొనసాగుతుంది. కాగా, గుర్తింపు యూనియన్‌గా విజయం సాధించిన బీఎంఎస్ జనరల్‌బాడీసమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటుంది.

ఐఎన్‌టీయూసీకి షాకిచ్చిన బీఎంఎస్..

ఎన్టీపీసీ గుర్తింపు ఎన్నికలలో ఐఎన్‌టీయూసీకి బీఎంఎస్ యూనియన్ షాకిచ్చింది. గత రెండుపర్యాయాలు(6సంవత్సరాలు) గుర్తింపు యూనియన్‌గా కొనసాగిన ఐఎన్‌టీయూసీని ఈసారి అనూహ్యంగా భారతీయ మజ్దూర్ సంఘ్ పరాజయం పాలు చేసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి బీఎంఎస్ పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. ఆ యూనియన్ నాయకులు వ్యూహాత్మకంగా పనిచేశారు. 2027లో జరగబోయే వేతన సవరణ విషయంలో మెరుగైన వేతన ఒప్పందం చేయిస్తామని, సీడీపీ, పీఆర్ఎంఎస్ సాధించేందుకు కృషి చేస్తామంటూ బీఎంఎస్ చేసిన హామీలను ఉద్యోగులు నమ్మినట్లు తెలుస్తున్నది. అలాగే గుర్తింపు యూనియన్‌గా ఐఎన్‌టీయూసీ వైఫల్యాలను ఎండగట్టడంలో బీఎంఎస్ సక్సెస్ అయ్యింది. నాలుగుదశాబ్దాల రామగుండం ఎన్టీపీసీ చరిత్రలో బీఎంఎస్ మొదటిసారి గుర్తింపు కార్మిక సంఘంగా గెలిచి చరిత్ర సృష్టించింది. గతంలో మెజారిటీసార్లు ఐఎన్‌టీయూసీ,సీఐటీయూ, హెచ్ఎంఎస్ యూనియన్లు గుర్తింపు సంఘాలుగా గెలిచాయి. ఈ క్రమంలో మొదటిసారిగా బీఎంఎస్ గుర్తింపు యూనియన్‌గా నిలిచింది.

ఈ విజయం కార్మికులకు అంకితం..
- బీఎంఎస్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి



ఎన్టీపీసీ గుర్తింపు ఎన్నికల్లో తమ గెలుపును కార్మికులకు అంకితం చేస్తున్నామని కార్మికసంఘ్(బీఎంఎస్) అధ్యక్ష,కార్యదర్శులు కేటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సాగర్ రాజు, కోశాధికారి చల్లా సత్యనారాయణరెడ్డి తెలిపారు. విజయం సాధించిన అనంతరం విలేకరులతోమాట్లాడతూ సుదీర్ఘకాలం గుర్తింపు యూనియన్‌గా కార్మికుల ప్రయోజనాలను పట్టించుకోని ఐఎన్‌టీయూసీకి కార్మికులే బుద్ధి చెప్పారన్నారు. వ్యక్తిగత లాభాపేక్షతో పైరవీలకే పరిమితమైన మజ్దూర్ యూనియన్‌ను ఉద్యోగులు తిరస్కరించారని స్పష్టం చేశారు. తాము ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చేడం కోసం కృషిచేస్తామని తెలిపారు. కాగా, ఎన్టీపీసీలో బీఎంఎస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. డప్పుచప్పుళతో టౌన్‌షిప్‌లో ర్యాలీ నిర్వహించారు.

నేడు జూనియర్ కళాశాలలో మెగా సమావేశం

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులతో అధ్యాపకుల మెగాసమావేశం ఈనెల26న నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన తెలిపారు. జిల్లాలోని 14ప్రభుత్వజూనియర్‌కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈకార్యక్రమంలో తల్లిదండ్రులకు విద్యార్థుల ప్రగతి, క్రమశిక్షణ, హాజరు సమగ్ర అభివృద్ధిపై అధ్యాపకులతో చర్చలు జరుపుతారని అన్నారు. ఈ సందర్భంగా గురువారం తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రికలను అందిస్తూ ఆహ్వాని స్తున్నట్లు తెలిపారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

ఓదెల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబాడ తండాలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించనున్నారు. దీనికి ముఖ్యఅతిథిగా పెద్దపల్లి జిల్లా జడ్జి సునీత హాజరవుతారు. ఈ సదస్సులో గిరిజన చట్టాలు, హక్కులు, వివిధసెక్షన్లపై అవగాహన కల్పిస్తారు. గిరిజన చట్టాలు, హక్కులు, కొన్నికేసుల్లో రాజీపడితే లాభాలు, రాజీపడకుంటే నష్టాలపై జడ్జి తండవాసులకు అవగాహన కల్పించనున్నారు.

మధ్యాహ్న భోజన వర్కర్ల నిరసన

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం రాయితీలు అందిస్తూ మధ్యాహ్న భోజనవర్కర్లను ఆదుకోవాలని గురువారం మండల విద్యాధికారి కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన వర్కర్లు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలను వెంటనే పరిష్క రించాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా మెరుపు సమ్మెకుదిగుతామని హెచ్చరించారు.

పట్టు పురుగుల షెడ్డు ప్రారంభం

జూలపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో పెసరు సూరమ్మ అనేరైతు పట్టుపురుగుల పెంపకం కోసం షెడ్డు నిర్మించగా ములుగు ప్రాంతీయ పట్టుపరిశోధన కేంద్రం అధికారులు బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మల్బరి సాగు, పట్టు పురుగుల పెంపకంతో రైతులు లాభాలు ఆర్జించ వచ్చన్నారు. కార్యక్రమంలో ఎం లత, సంయుక్త సంచాలకులు, డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ రాఘవేందర్, జిల్లా అధికారి తిరుపతిరెడ్డి, హెచ్‌ఈవో మహేష్ రైతులు పాల్గొన్నారు.

రామగుండంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

● అధికారులతో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ అధికారులకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సూచించారు. గురువారం ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధిపనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ఈఈ రామన్, డీఈ జమీల్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించండి..

కళ్యాణ్‌నగర్: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ వైద్యులకు సూచించారు. గురువారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇటీవల కత్తిపోట్లకు గురైన చికిత్స పొందుతున్న కుమారస్వామిని పరామర్శించారు. అతడికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఎంవో రాజు, డిప్యూటీ సూపరింటెండెంట్ అరుణ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

రైతును సన్మానించిన రాష్ట్ర మంత్రులు

ఎలిగేడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన రైతు, ఉత్తమ గ్రామ పంచాయతీ మాజీసర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావుకు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్‌లో గురువారం సీడ్స్‌మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి ఆయనను సన్మానించారు. సుల్తాన్‌పూర్‌లో ఆయన పలు కంపెనీలకు చెందిన హైబ్రిడ్, నాణ్యమైన వరివిత్త నాలను ఉత్పత్తిచేయడంపై దృష్టిసారించారు. చుట్టు పక్కల ఉన్న గ్రామాల రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి అధిక దిగుబడులకు కృషి చేశారు. వెంకటేశ్వర్‌రావును విత్తన ఉత్పత్తిదారుడిగా గుర్తించి ఉత్తమ రైతుగా ఎంపికచేశారు. ఈ సందర్భంగా మంత్రులు ఆయనకు శాలువాకప్పి మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో శీర్షిక అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్‌వీరామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రఘు, వాసు, సభ్యులు తానిపర్తి రవీందర్ రావు, వెల్ది తిరుపతిరావు తదితరులు ఉన్నారు.



రైతు వెంకటేశ్వర్‌రావును సన్మానిస్తున్న మంత్రులు

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న జగదీశ్వర్

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో గురువారం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును గడ్డం జగదీశ్వర్ అందుకున్నారు. హైదరాబాద్‌లో బిర్లా ప్లానిటోరియంలోని భాస్కరా ఆడిటోరియంలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య చేతుల మీదుగా జగదీశ్వర్‌కు అవార్డును అందజేసి సత్కరించారు. పెద్దపల్లి జిల్లా ఆంగ్లం సబ్జెక్ట్ రిసోర్స్ పర్సన్‌గా రాణించిన జగదీశ్వర్ ప్రస్తుతం రామగుండం మండలం ప్రాథమికోన్నత పాఠశాల దుర్గయ్యపల్లి, అన్నపూర్ణకాలనీ ఎన్టీపీసీలో ఆంగ్లం ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. అవార్డు అందుకోవడం పట్ల పలువురు అధికారులు, ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.

5న అలాయ్ - బలాయ్..

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా సామాజిక ఐక్యవేదిక ఆధ్వర్యంలో అక్టోబరు5న గోదావరిఖనిలో అలాయ్ బలాయ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సామాజిక సమరసతా వేదికకన్వీనర్ క్యాతం వెంకటరమణ చెప్పారు. గురువారం గోదావరిఖని జవహర్‌నగర్‌లోని శిశు మందిర్‌లో జరిగిన కులసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 50కిపైగా కులసంఘాల ప్రతినిధులతో ఘనంగా ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈఏడాది అధ్యక్షుడిగా బండారి రాయమల్లు, ప్రధానకార్యదర్శిగా సబ్బు మల్లయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముస్కులభాస్కర్‌రెడ్డి, బొంకూరి మధు, దుబాసి బొందయ్య,శ్రీనివాస్‌రెడ్డి, వీరేశం పాల్గొన్నారు.

జీపీ ఉద్యోగ, సిబ్బంది సీఐటీయూ జిల్లా కమిటీ



రవీందర్, ఖాజా

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఉద్యోగ,సిబ్బంది యూనియన్ సీఐటీయూ జిల్లా 4వ మహాసభలు ధర్మారం మండల కేంద్రంలో బుధవారం వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఆకుల రాజయ్య ప్రాంగణంలో నిర్వహించారు. ఇందులో సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు ముఖ్యఅతిథిగా పాల్గొని గడిచిన మూడేళ్ల ఉద్యమాలు, పోరాటాలు, సాధించిన విజయాలను సమీక్షించుకున్నారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవఅధ్యక్షుడిగా ఎరవెల్లి ముత్యంరావు, అధ్యక్షుడిగా సీపెల్లి రవీందర్, జిల్లాప్రధానకార్యదర్శిగా ఖాజా, కోశాధికారిగా గౌసోద్దిన్, జిల్లా ఉపాధ్యక్షుడుగా ఇరుగురాల లచ్చయ్య, కన్నూరి రామచందర్, పైడిపల్లి నాగయ్య, కూనమల్ల అశోక్, దొడ్లరాజబాబు, సహాయకార్యదర్శులుగా రెడ్డిమల్ల నాగేశ్వర్, సురేష్, శ్రీనివాస్, జంగపెల్లి నరేష్, గట్టయ్య, ఎదుల్ల రవికుమార్, కమిటీసభ్యులు శాతరాజుల గంగాధర్, వేల్పుల భాస్కర్, దేవెందర్, ఆకుల నరేష్, అంబాల లక్ష్మణ్‌తోపాటు పలువురిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

నేడు, రేపు ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

పెద్దపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలకు నియమించిన ప్రిసైడింగ్ అధికారులకు సెప్టెంబర్ 26, 27తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నామని జిల్లాకలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న ఉదయం 10గంటలకు ధర్మారం వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఎలిగేడు, జూలపల్లి, ధర్మారంమండలాలకు, సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాలకు, ఎన్టీపీసీ కాకతీయ కళ్యాణమండపంలో పాలకుర్తి, అంతర్గాం, రామగుండం మండలాలకు చెందిన ఎన్నికల అధికారులకు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. 27నఉదయం 10గంటలకు సుల్తానాబాద్‌లోని యశోద నరహరి ఫంక్షన్‌హాల్‌లో ఓదెల, సుల్తానాబాద్ మండలాలకు, మంథని జేఎన్టీయూకళాశాలలో కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం, మంథని మండలాలకు చెందిన ఎన్నికల అధికారులకు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారుల ఆర్డర్లు సంబంధిత ఎంపీడీవోలకు పంపించామన్నామని, అందరూ సకాలంలో హాజరు కావాలన్నారు.

పెద్దపల్లికి 50వేల మెట్రిక్‌టన్నుల అదనపు ధాన్యం కోటా మంజూరు

సుల్తానాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): యాసంగి 2024-25 సీజన్‌లో పెద్దపల్లి జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 50వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం కోటా మంజూరు చేసినట్లు జిల్లా రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు మోరపల్లి తిరుపతిరెడ్డి, సుల్తానాబాద్ మిల్లర్ల సంఘం ప్రధానకార్యదర్శి జైపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కోటా సాధనలో కీలకపాత్ర పోషించిన పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, సివిల్ సప్లయి కమిషనర్‌కు జిల్లా రైస్‌మిల్లర్లు కృతజ్ఞతలు తెలిపారు. కోటా సాధనలో ముందుండి ప్రయత్నాలు చేసిన పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు నేతృత్వాన్ని వారు కొనియాడారు. ఈ అదనపుకోటా వల్ల రైతులు, మిల్లర్లు ఇబ్బందులు లేకుండా సులభంగా కొనుగోలు జరిపే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి ఇది పెద్ద సహకారమని జిల్లా, సుల్తానాబాద్ మండల రైస్‌మిల్లర్ల సంక్షేమసంఘం నాయకుడు పురుషోత్తం రావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఎడతెరిపి లేని వర్షం



వర్షంతో జన సంచారం లేని కళ్యాణ్‌నగర్ రోడ్లు

కళ్యాణ్‌నగర్/జూలపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రెండురోజులుగా కురుస్తున్న వర్షంతో రామగుండం పారిశ్రామికప్రాంతంలో మండలాల్లో జనసంచారం అతలాకుతలం అయింది. బుధవారం ఉదయం నుంచి ముసురుతో ప్రారంభమైన వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. కార్పొరేషన్‌లోని పలురోడ్లు జలమయం కాగా ప్రధానాలాలు పొంగి ప్రవహిస్తున్నాయి. దసరా సీజన్ కావడంతో, వర్ష ప్రభావంతో వ్యాపారకూడలి జనంలేక వెలవెలబోయింది. గోదావరిఖని ఓసీపీ-5లో బొగ్గుఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. వర్షంతో గురువారం రాత్రి జనసంచారం లేక మార్కెట్ కళతప్పింది. వర్షంతో గ్రామాల్లోని అంతర్గతరోడ్లు బురదమయంగా మారాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి కాపుకొచ్చిన పత్తికాయలు నల్ల బారిపోయి,పూత విపరీతంగా రాలుతూ నష్టం జరుగుతోందని జూలపల్లి మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి రైతులు మాత్రం వర్షంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజులు వర్షం ఉంటుందని వాతావరణశాఖ పేర్కొన్నది.

మంథని: మండలంలోని గ్రామాలు పూర్తిగా చిత్తడిగామారాయి. రోడ్లు, డ్రైనేజీలు వర్షంతో నిండిపోయాయి. ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారులు, దినసరికూలీలు, చిరువ్యాపారులు బయటకు రావటానికి ఇబ్బందులు పడ్డారు. పండగపూట షాపింగ్, ఇతర అవసరాలను తీర్చుకోవటానికి ప్రజలుఇక్కట్లు ఎదుర్కొన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు,రోగులు నానాఅవస్థలు పడుతున్నారు. గోదావరి, మానేరునదులతోపాటు బొక్కల వాగు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

ఓదెల: మండలంలోని మానేరు వాగు పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పొత్కపల్లి ఎస్ఐ రమేష్ అన్నారు. ఎల్ఎండీ ఎగువ ప్రాంతం నుంచి వరదల ఉధృతి పెరుగుతుండడంతో, మానేరు వాగులో నీటిమట్టం పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గుంపుల రామభద్రాలయంలో దర్శనం కోసం వచ్చేభక్తులు చాలా జాగ్రత్తలు పాటించా లన్నారు. ప్రజలు మానేరు నది వైపు వెళ్లవద్దని అలాగే మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని అన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో నివాసం ఉండడం కూడదని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను ఎవరు తాకవద్దని అన్నారు.

పార్వతీ బ్యారేజీలో పెరుగుతున్న వరద ఉధృతి

మంథనిరూరల్: మండలంలోని సిరిపురం సమీపంలోని పార్వతీ(సుందిల్ల) బ్యారేజ్‌లో గురువారం సాయంత్రం వరకు వరద ఉధృతి భారీగా పెరిగింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు పైన ఎల్లంపల్లి ప్రాజెక్టులో గేట్లు ఎత్తి నీరు దిగువ ప్రాంతానికి వదలడంతో పార్వతీ బ్యారేజ్‌లోకి 6లక్షల 98వేల క్యూసెక్‌ల వరద నీరు వచ్చి చేరింది. అయితే ప్రాజెక్టులో ఉన్న 74గేట్లు ఎత్తి ఉండటంతో వరదనీరు దిగువకు విడుదల అవుతోంది. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో గోదావరినదిలో వరదఉధృతి పెరుగుతుండటంతో పరివాహక ప్రాంతాల రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే రెండుసార్లు నది వరద ఉధృతి పెరగడంతో రైతులు పత్తి, వరిపంటలను నష్టపోయారు. మరోసారి ఇదేవిధంగా వరద ప్రవాహం పెరిగితే రైతులు పూర్తిగా పంటలు నష్టపోయే అవకాశం ఉంది.

న్యూలియో ఫౌండేషన్ అధ్యక్షుడికి అరుదైన గౌరవం

జూలపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన న్యూ లియోఫౌండేషన్ అధ్యక్షుడు ఎండీ తాహెర్‌పాషా పదేళ్లుగా చేస్తున్న సేవలకు అరుదైన గౌరవం లభించింది. దేశరాజధాని ఢిల్లీలో నిర్వహిస్తున్న యువజాతీయ సమ్మేళనంలో నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరమ్ వారు తాహెర్‌పాషాకు రాష్ట్రస్థాయి చాంపియన్ ఆఫ్‌చేంజ్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా తాహెర్‌పాషా మాట్లాడుతూ తనకు అవార్డు రావడంపై సంతోషంగా ఉన్నప్పటికీ బాధ్యత మరింతగా పెరిగిందన్నారు. అందరి సహకారంతో ప్రజలకు అవసరమైన సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నాడు.



అవార్డు అందుకుంటున్న ఎండీ తాహెర్ పాషా

వాహనం ఢీకొని యువకుడి మృతి

రామడుగు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):రామడుగు మండలం కొరటపల్లి గ్రామంలో గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొనగా యువకుడు దుర్మరణం చెందిన సంఘటన గ్రామంలో కలకలం రేపింది. రామడుగు ఎస్‌ఐ కె రాజు కథనం ప్రకారం కొరటపల్లి గ్రామానికి చెందిన మేకల శ్రీధర్(27) తన బజాజ్ ప్లాటినంపై రామడుగు నుంచి కొరటపల్లి వెళ్తుండగా షానగర్ కల్వర్టు వద్ద గుర్తుతెలియని, అజాగ్రత్తగా, అతివేగంగా వస్తున్న కోళ్ల వాహనం ఢీకొట్టింది. దీంతో శ్రీధర్ ఎగిరి కిందపడి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడి తండ్రి మేకల సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీతారాంపూర్ వద్ద మరొకరు..


కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం సీతారాంపూర్ గ్రామశివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చొప్పదండికి చెందిన కొంకటి సందీప్(24) మృతి చెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. సందీప్ కరీంనగర్‌లోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ గురువారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై కరీంనగర్‌కు వస్తున్నాడు. కేఆర్ గార్డెన్ వద్ద ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు సందీప్ బైక్‌ను ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో తలకు, ముఖంకు తీవ్రగాయాలైన సందీప్‌ను 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు, మృతుడి తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీలో పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి డ్రైవర్ పోస్టులు
- 743 శ్రామిక్ పోస్టులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పోస్టుల భర్తీకి సంస్థ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా పలు పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డ్రైవర్ పోస్టులు వెయ్యి ఉండగా, శ్రామిక్ పోస్టులు 743 పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్, ములుగు జిల్లాలను డిస్ట్రిక్ట్ కేడర్-2గా నిర్ణయించి 48 డ్రైవర్ పోస్టులను నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. ఇందులో లిమిటెడ్ రిక్రూట్‌మెంట్ (బ్యాక్‌లాగ్)లో ఏడు పోస్టులు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో 41 పోస్టులను భర్తీ చేయనున్నారు. శ్రామిక్ పోస్టులుగా మెకానికల్ డీజిల్/మెకానికల్ మోటార్ వెహికల్ పోస్టులు 29 భర్తీ చేయనున్నారు.



ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

తెలంగాణ రాష్ట్రంలో భర్తీ చేయనున్న పోస్టులకు గాను అక్టోబరు 8వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. www.tgprb.in వెబ్‌సైట్‌లో అక్టోబరు 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కావడంతో దరఖాస్తులు సమర్పించేందుకు నిరుద్యోగులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

డిస్ట్రిక్ట్ కేడర్-2లో డ్రైవర్ పోస్టులు

	ఎల్ఆర్	డీఆర్	మొత్తం
కరీంనగర్	2	10	12
పెద్దపల్లి	1	9	10
జగిత్యాల	2	9	11
రాజన్న సిరిసిల్ల	1	6	7
జయశంకర్	1	4	5
ములుగు	0	3	3
	7	41	48

డిస్ట్రిక్ట్ కేడర్-2లో శ్రామిక్ పోస్టులు

	ఎల్ఆర్	డీఆర్	మొత్తం
కరీంనగర్	0	7	7
పెద్దపల్లి	0	6	6
జగిత్యాల	0	7	7
రాజన్న సిరిసిల్ల	0	4	4
జయశంకర్	0	3	3
ములుగు	0	2	2
	0	29	29

ఎల్ఆర్ (లిమిటెడ్ రిక్రూట్‌మెంట్), డీఆర్ (డైరెక్ట్ రిక్రూట్‌మెంట్)

రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో డ్రైవర్ పోస్టులు వెయ్యి, శ్రామిక్‌లుగా 743 పోస్టులను భర్తీ చేయనున్నారు. డ్రైవర్లకు పే స్కేల్ 20,960-60,080, శ్రామిక్ పోస్టులకు 16,550-45,030 నిర్ణయించారు.

వేములవాడలో ఇంట్లోకి కొండచిలువ



వేములవాడ పట్టణంలోని గాంధీనగర్‌లో కొండచిలువ



విద్యుత్తు స్టార్టర్ బాక్స్‌లోని ఫ్యూజ్‌లో ఉన్న కట్ల పాము

వేములవాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణం గాంధీనగర్‌లోని ఓ ఇంట్లో గురువారం ఉదయం భారీ కొండచిలువ ప్రత్యక్షమైంది. అంజయ్య అనే వ్యక్తి ఇంట్లో కొండచిలువ కనిపించడంతో కుటుంబ సభ్యులు భయాందోళన గురయ్యారు. కాలనీవాసులు అక్కడకు చేరుకొని సుమారు ఆరడుగుల కొండచిలువను చంపి వేశారు. మూలవాగులో నీటి ప్రవాహం పెరుగుతుండడంతో పాటు, మిడ్‌మానేరు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ చేరుకున్న కారణంగా పరిసర ప్రాంతాల్లోని ఇండ్లలోకి తరచూ పాములు వస్తున్నట్లు ఇక్కడి ప్రజలు తెలిపారు.

విద్యుత్ స్టార్టర్ బాక్స్‌లో పాము

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని రైతు మొడుసు బాపురెడ్డి తన వ్యవసాయ పొలంలో ఉన్న విద్యుత్తు స్టార్టర్ డబ్బాలో గురువారం కట్ల పాము ప్రత్యక్షమైంది. వ్యవసాయ బోరు మోటారును ఆఫ్ చేసేందుకు ఓ ఫ్యూజ్ తీయడంతో అందులో కట్లపాము చుట్టుకుని కనిపించింది. భయాందోళనకు గురైన రైతు బాపురెడ్డి కర్ర తీసుకుని చంపేందుకు ప్రయత్నించగా తప్పించుకుపోయిందని పేర్కొన్నాడు.

జగిత్యాలలో ఒకరి హత్య

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ శివారులోని ఓ దాబాలో బుధవారం అర్ధరాత్రి జగిత్యాల మండలం మోరపల్లి గ్రామానికి చెందిన వంగ శ్రీనివాస్(43) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల పట్టణంలోని నిజామాబాద్ రోడ్డులో గల ఓ బార్‌లో పట్టణంలోని చింతకుంటవాడకు చెందిన చరణ్‌జీత్ సింగ్, దాసరి సుమన్ అనే ఇద్దరి మధ్య బుధవారం అర్ధరాత్రి గొడవ జరిగింది. ఈ క్రమంలో జగిత్యాల మండలం మోరపల్లి గ్రామానికి చెందిన వంగ శ్రీనివాస్ ఆపడానికి వెళ్లగా చరణ్‌జీత్ సింగ్ బీరు సీసాతో తలపై కొట్టాడు. దీంతో శ్రీనివాస్ కిందపడగా చరణ్‌జీత్ సింగ్ అతడిపై దాడిచేయగా తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనివాస్‌ను జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు శ్రీనివాస్ భార్య వంగ సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు చరణ్‌జీత్ సింగ్ పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వీధుల్లో గుంపులుగా శునకాలు

- భయాందోళనలో ప్రజలు



పెగడపల్లిలో ప్రధాన రహదారిపై శునకాలు

పెగడపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలో కుక్కల బెడద ఎక్కువైంది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో అంబేద్కర్ కూడలి నుండి గాయత్రి బ్యాంక్ వరకు డబుల్ రోడ్డులో కుక్కలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఎక్కడ చూసినా పది నుంచి 20 వరకు గుంపులుగా ఉంటూ ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారి వెంట పడి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ప్రభుత్వం పట్టించుకుని తమకు కుక్కల బెడద నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

మల్యాల: గ్రామాల్లో శునకాల బెడద నానాటికి పెరుగుతోంది. శునకాల సమూహంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మల్యాల మండల కేంద్రంతో పాటు ప్రతి గ్రామంలో శునకాల దాడిలో అనేక మంది గాయాల పాలు అవుతున్నారు. అధికారులు శునకాలను తరలించే చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.



మల్యాలలో శునకాల గుంపు

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన ఎద్దు నర్సయ్యకు చెందిన రెండు గొర్రెలు విద్యుదాఘాతంతో గురువారం మృతి చెందాయి. రోడ్డుపక్కన ఉన్న విద్యుత్ స్తంభం సపోర్టు వైరుకు గొర్రెలు తగలడంతో దాదాపు రూ.24వేల విలువైన రెండు గొర్రెలు మృతిచెందాయి. సమాచారం అందుకున్న సెస్‌సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సెస్‌సంస్థ ఆదుకోవాలని బాధితుడు కోరారు.

‘కడారి’కి కన్నీటి వీడ్కోలు..

- గోపాల్‌రావుపల్లిలో అంత్యక్రియలు పూర్తి
- నివాళులర్పించిన ప్రజాసంఘాల నాయకులు



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న చిన్ననాటి మిత్రుడు టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు దేవిప్రసాద్ తదితరులు



గోపాల్‌రావుపల్లిలో కడారి సత్యనారాయణరెడ్డి అంతిమయాత్ర

తంగళ్లపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో ఈ నెల 22న ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు కోసా అలియాస్ కడారి సత్యనారాయణరెడ్డికి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు గురువారం కన్నీటి వీడ్కోలు పలికారు. కోసా అంత్యక్రియలు రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావ్‌పల్లిలో పూర్తయ్యాయి. గురువారం కడారి సత్యనారయణరెడ్డి మృతదేహం స్వగ్రామానికి చేరుకోగానే బంధువులు, స్థానికులు కంటతడి పెట్టుకున్నారు. సందర్శకుల కోసం ఆయన ఇంటి ఆవరణలో మృతదేహాన్ని ఉంచారు. వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు, కళాకారులు ఘనంగా నివాళులర్పించారు. బంధుమిత్రులు నివాళులర్పించి కడారితో అనుబంధాన్ని, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఎర్ర జెండాలతో, విప్లవ గీతాలతో కడారి అంతిమయాత్ర సుమారు మూడు గంటల పాటు కొనసాగింది. ఈ సందర్భంగా భారత్ బచావో జాతీయ అధ్యక్షుడు గాదె ఇన్నయ్యతో పాటు పౌర సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎన్‌కౌంటర్లను కేంద్ర ప్రభుత్వం చేసిన హత్యలుగా అభివర్ణించారు. కడారితో పాటు రాజును బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారని ఆరోపించారు. విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాణి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణరావ్, టీఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షుడు దేవిప్రసాద్, అమరుల బంధు మిత్రుల కమిటీ రాష్ట్ర కార్యదర్శి పద్మకుమారి, సహాయకార్యదర్శి భవాని, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, వివిధ పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరునెలల వ్యవధిలో దంపతులిద్దరూ..

ఉద్యమబాట పట్టిన కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోసా, ఆయన భార్య రుక్కు. అలియాస్ రాధలు ఆరు నెలల వ్యవధిలో అమరులయ్యారు. ఉద్యమబాట పట్టిన కడారి సత్యనారాయణరెడ్డి మావోయిస్టు పార్టీలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న రుక్కు అలియాస్ రాధను వివాహం చేసుకున్నాడు. తీవ్ర అనారోగ్యానికి గురైన రాధ ఈ ఏడాది మార్చి 29న మరణించిందని అంత్యక్రియల్లో పాల్గొన్న విప్లవ సంఘాల నేతలు తెలిపారు.

చిన్నప్పుడు చీకటి అంటే భయపడేవాడు

- కడారి కరుణాకర్‌రెడ్డి, సోదరుడు



చిన్నప్పుడు సత్యనారాయణరెడ్డి చీకటి అంటే భయపడేవాడు. పదో తరగతి చదివేటప్పుడు రాత్రిపూట బయటకి వెళ్లాలంటే తోడు లేనిది వెళ్లేవాడు కాదు. అలాంటిది మావోయిస్టు పార్టీలోకి వెళ్లాడంటే నమ్మలేకపోయాం. 1980లో ఉగాది పండుగకు ఇంటికి వచ్చి ఒకరోజు గడిపాడు. అప్పుడు గ్రామం నుంచి వెళ్లి 45 సంవత్సరాల తర్వాత శవమై వచ్చాడు.

విప్లవ ఉద్యమానికి శత్రువులు భయపడుతున్నారు

పాణి, విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు



విప్లవ ఉద్యమానికి శత్రువులు భయపడుతున్నారు. భౌతికంగా వ్యక్తులు లేకపోవచ్చు కానీ మావోయిజం సజీవంగా ఉంటుంది. కార్పొరేట్ సంస్థలకు ఖనిజ సంపదను ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను హత్య చేస్తోంది. దానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న కోసాను హత్య చేసింది.

నాయకత్వ లక్షణాలు ఉండేవి

- ఠాకూర్ కరణ్‌లాల్, మిత్రుడు



కడారి సత్యనారాయణరెడ్డిలో నాయకత్వ లక్షణాలు ఉండేవి. పెద్దపల్లిలో కడారి 1976-78 సంవత్సరంలో ఐటీఐ చదివాడు. అప్పుడు స్నేహం ఏర్పడింది. కడారిలో స్నేహం, మంచితనం, ఉద్యమస్ఫూర్తి ఉండేవి.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంటకు చెందిన మచ్చ భూమక్క(62) ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న భూమక్క జీవితంపై విరక్తితో బుధవారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా గురువారం ఉదయం మృతి చెందింది. భూమక్క కుమారుడు కుమారస్వామి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బొమ్మకల్‌లో ఈ నెల 9న రాకేష్ అనే వ్యక్తి తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా కరీంనగర్ రూరల్ పోలీసులు ఆ ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఆదిలాబాద్‌లో ఉన్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ ఫోన్‌ను గురువారం బాధితుడికి సీఐ నిరంజన్‌రెడ్డి ద్వారా అందజేశారు.

గీత కార్మికుడికి గాయాలు

రామగిరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్నాపూర్ గ్రామానికి చెందిన నేరెళ్ల శంకర్‌గౌడ్ గురువారం ఈత చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఉదయం ఈత చెట్టు నుంచి కల్లు దించే క్రమంలో చెట్టుకు వేసుకున్న నిచ్చెన జారీ పోవడంతో చెట్టుపై నుంచి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో నడుముకు గాయాలు కాగా కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

ఇంటిలో గ్యాస్ లీక్.. తప్పిన ప్రమాదం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మేర్గవేణ ప్రశాంత్ ఇంటిలో పండుగ సందర్భంగా గురువారం పిండి వంటలు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో గ్యాస్ పొయ్యి పక్కన ఉన్న సామగ్రికి మంటలు అంటుకొని కాలిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గమనించిన చుట్టు పక్కల వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. దీంతో పెద్దప్రమాదం తప్పిందని కుటుంబ సభ్యులతో పాటు చుట్టు పక్కల వారు ఊపిరి పీల్చుకున్నారు.

పెద్దమ్మ గుడిలో చోరీ

శంకరపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం పెద్దమ్మ గుడిలో దుండగులు చోరీకి పాల్పడి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. కేశవపట్నం గ్రామంలోని ముదిరాజ్ సామాజిక వర్గం వారు పెద్దమ్మ గుడిలో వారానికి ఒకరు చొప్పున ఆలయ పరిసరాలు శుభ్రపరిచి పూజా కార్యక్రమాలు చేస్తుంటారు. అందులో భాగంగా గురువారం ఉదయం వారు వెళ్లి చూడగా సుమారు లక్ష రూపాయలు విలువ చేసే బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్లు తెలిపారు. ఈ మేరకు ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రవి చోరీ విషయంపై పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

మహిళకు లైంగిక వేధింపులు

నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళను లైంగిక వేధించి ఆమె ఆత్మహత్యకు కారణమైన రాజన్న సిరిసిల్ల జిల్లా జోగాపూర్ గ్రామానికి చెందిన నిందితుడు మొహమ్మద్ రహీం(38)కు ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ మెట్‌పల్లి కోర్టు సీనియర్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి నాగేశ్వర్‌రావు గురువారం తీర్పు వెలువరించారని ఎస్పీ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన ఓ మహిళను మొహమ్మద్ రహీం తరచూ వెంబడిస్తూ లైంగికంగా వేధించాడు. ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడాడు. దీంతో బాధిత మహిళ 2018 ఫిబ్రవరిలో మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. అయినా నిందితుడి ప్రవర్తనలో మార్పు రాలేదు. బాధితురాలిని, ఆమె భర్తను, కుటుంబ సభ్యులను ఫోన్‌లో వేధించడంతో బాధిత మహిళ అవమానం తట్టుకోలేక 25 మార్చి 2018లో ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు నిందితుడిపై మరొక కేసు నమోదు చేశారు. దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం సాక్ష్యాలు, వాంగ్మూలాలు సమీక్షించిన న్యాయమూర్తి నాగేశ్వర్‌రావు నిందితుడు మొహమ్మద్ రహీంకు ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

నిందితునికి శిక్ష పడటంలో కృషి చేసిన పీపీ ఆనంద్ గౌడ్, అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఎస్ఐ శంకర్‌రావు, సీఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ వినోద్‌లను ఎస్పీ అభినందించారు.

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన వ్యాను

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం సమీపంలో గల విద్యుత్తు స్తంభాన్ని గురువారం రాత్రి ఓ వ్యాను అతివేగంగా ఢీకొట్టింది. ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో పాటు కరెంటు స్తంభం, తీగలు తెగిపోయి వాహనంపై పడ్డాయి. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడం వల్ల ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న 'సెస్' సిబ్బంది మరమ్మతు పనులను చేపట్టారు. సుమారు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

అవయవదానం.. ఆరుగురికి ప్రాణదానం

- కన్నాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి బ్రెయిన్‌డెడ్

- అవయవదానానికి ఒప్పుకున్న కుటుంబీకులు



రాజేష్‌కుమార్ (ఫైల్)

శంకరపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాను మరణించినా అవయవదానం ద్వారా ఆరుగురికి జీవించే అవకాశం కలిగించాడు.

అవయవదానంతో కొన్ని కుటుంబాల్లో కొత్త వెలుగులు నిండుతాయి. మరణించినా జీవించి ఉండడమే అవయవదానం గొప్పతనమని అతని భార్య, తల్లిదండ్రులు ఆలోచించి పుట్టెడు దుఃఖంలోనూ ఆరుగురి జీవితాల్లో వెలుగు నింపడానికి అవయవదానానికి ముందుకు వచ్చారు. వివరాల్లోకి వెళ్లితే.. శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన చిలువేరి రాజేష్‌కుమార్ (38) ఉద్యోగ రీత్యా కరీంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 20న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో తలకు తీవ్రమైన గాయాలు కావడంతో హైద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్‌తో బుధవారం రాత్రి మృతి చెందాడు. అతని భార్య సుస్మిత, తల్లిదండ్రులు చిలువేరి ఆగయ్య-వజ్రమ్మ పుట్టెడు దుఃఖంలో అవయవదానానికి ఒప్పుకున్నారు. అవయవాలను జీవన్‌ధాన్ సంస్థకు అప్పగించారు. తాను మరణించినా మరో నాలుగు కుటుంబాల్లో వెలుగు నింపడానికి అవయవదానానికి ముందుకు రావడంపై గ్రామస్థులు కుటుంబాన్ని అభినందిస్తున్నారు. మృతుడు రాజేష్‌కుమార్‌కు తల్లిదండ్రులు, ఇద్దరు కూతుళ్లు, భార్య స్వప్న ఉన్నారు. గురువారం కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీటి మధ్య కన్నాపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు.

బలహీనవర్గాలకు అండగా కాంగ్రెస్

- మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఆదివాసీ శిక్షణ తరగతులు ప్రారంభం



ఆదివాసీ గిరిజనుల శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సామాజిక న్యాయానికి ఛాంపియన్‌గా ఉందని, ఆదివాసీలు, గిరిజనులు, బలహీన వర్గాలకు పార్టీ అండగా నిలుస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర గిరిజన, మైనార్టీ, సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయి కాంగ్రెస్ ఆదివాసీలకు రాష్ట్ర ఆదివాసీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ తరగతులను డీసీసీ కార్యాలయంలో గురువారం ప్రారంభించారు. మొదట డీసీసీ కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం వేదికపై సేవలాల్ మహరాజ్, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల శిక్షణ తరగతులను మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి, బలహీన వర్గాలకు సంబంధించిన అంశాలు చర్చించాలన్నారు. కాంగ్రెస్ సామాజిక న్యాయానికి ఛాంపియన్ అని, పార్టీలో మాత్రమే సామాజిక న్యాయం ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రమే బలహీన వర్గాల అభివృద్ధి జరిగిందని అన్నారు. విద్య భవిష్యత్ సమాజానికి పునాదులు వేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. నాడు ఈ దేశంలో ఆదివాసీలకు, గిరిజనులకు, బలహీన వర్గాలకు అండగా ఉన్నది ఇందిరాగాంధీ, కాంగ్రెస్ పార్టీయే అన్నారు. నాటి నుంచి సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, గిరిజనులకు అండగా ఉన్నారన్నారు. మొదటిసారి రాష్ట్ర ప్రభుత్వం ట్రైబల్ అడ్వయిజర్ కమిటీ బోర్డు మీటింగ్ ఏర్పాటు చేసిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఆదివాసీలను పట్టించుకోలేదని, మన రాష్ట్ర ప్రభుత్వం సుమారు 740 కోట్ల రూపాయలతో ఆదివాసీలు నివసించే ప్రాంతాలలో మౌలిక వసతులు కల్పనకు నిధులు వెచ్చించిందని తెలిపారు. రాష్ట్ర ఆదివాసీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బెల్లయ్యనాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్‌లో దేశంలోని 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలని ఏఐసీసీ నిర్ణయం తీసుకుందన్నారు. దేశవ్యాప్తంగా 25 వేల మంది కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దాలని నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్రంలోని 7 ఉమ్మడి జిల్లాల్లో ట్రైబల్స్‌కు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేం దర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్టీ సెల్ సమన్వయకర్త కోట్యానాయక్, కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, జిల్లా కాంగ్రెస్ ఆదివాసీ సెల్ చైర్మన్ బానోతు శ్రవణ్‌నాయక్, జిల్లా ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, మాజీ హౌస్ ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి పాల్గొన్నారు.

చేనేతపై జీఎస్టీని ఎత్తివేయాలి

● రాష్ట్రపతికి ఎమ్మెల్సీ ఎల్ రమణ లేఖ



జగిత్యాల అర్బన్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): చేనేత రంగంపై విధించిన జీఎస్టీని వెంటనే ఎత్తివేయాలని కోరుతూ ఎమ్మెల్సీ ఎల్ రమణ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు గురువారం లేఖ రాశారు. లేఖలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలను అందులో వివరించారు. 2017లో ముడి సరుకులపై విధించిన జీఎస్టీ ఐదు శాతం, ఇప్పుడు చేనే త ఉత్పత్తులపై విధించిన జీఎస్టీ 18శాతంతో లక్షలాది చేనేత కుటుంబాల జీవనోపాధి దెబ్బతినే అవకాశం ఉందని పేర్కొన్నారు. చేనేత ఉత్పత్తులు, ముడి సరుకులపై జీరో జీఎస్టీని అమలు చేయాలని, చేనేతకు సంబంధించిన నిర్ణయాలు తీసుకునేటప్పుడు కార్మికులను భాగస్వామ్యం చేయాలని, హ్యాండ్లూమ్ బోర్డును పునరుద్ధరించాలని రమణ రాష్ట్రపతిని అభ్యర్థించారు. రాష్ట్రపతి తక్షణమే జోక్యం చేసుకుని వేలాది చేనేత కుటుంబాలను రక్షించాలని రమణ రాష్ట్రపతికి విజ్ఞప్తి చేశారు.

ముగిసిన కబడ్డీ క్రీడా శిక్షణ శిబిరం



జిల్లా బాలికల జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా నిర్వహిస్తున్న కబడ్డీ క్రీడా శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్‌లో జరిగే 35వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ పోటలకు ఎంపిక చేశారు. కరీంనగర్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు చెన్నాడి అమిత్ కుమార్ హాజరై రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిక కాని క్రీడాకారులు నిరుత్సాహ పడకుండా భవిష్యత్‌లో పోటీలకు సిద్ధం కావాలని సూచించారు. జిల్లా బాలబాలికల జట్లు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో చోటు సంపాదించాలని ఆకాంక్షించారు. జిల్లా జట్లకు కోచ్, మేనేజర్లుగా వ్యవహరిస్తున్న పద్మ, ప్రశాంత్, పవన్, కృపాకర్, శివాజీని అభినందించారు. క్రీడాకారులకు క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ జనరల్ సెక్రెటరీ మల్లేషగౌడ్, రాష్ట్ర కబడ్డీ వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ సంపత్‌రావు, పెద్దపల్లి డీవైఎస్‌వో సురేష్, కబడ్డీ అసోసియేషన్ సభ్యులు వీరన్న, హనుమంత్, సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేములవాడలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



రాజన్న ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఎంతో విశిష్టమైన బతుకమ్మ పండుగను దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ రాజన్న క్షేత్రంలో వైభవంగా ఏడు రోజులపాటు నిర్వహిస్తారు. రాజన్న ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాల వెలుగుల్లో మహిళలు బతుకమ్మలను ఆడిపాడారు. ఐదో రోజు అట్ల బతుకమ్మ వేడుకలను మహిళలు, యువతుల ఘనంగా నిర్వహించారు. జోరువాన కురుస్తున్నా మహిళలు, యువతులు వర్షంలోని ఆలయానికి తరలివచ్చి బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. రాజన్నఆలయ ధర్మగుండంలో బతుకమ్మలను నిమజ్జనంచేసి వాయినం ఇచ్చిపుచ్చుకున్నారు. రాజన్న ఆలయంలో దేవీనవరాత్రోత్సవాల్లో భాగంగా సాయంత్రం అమ్మవారి వద్ద కుంకుమ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

శాస్త్రీయ విద్యావిధానం అమలుచేయాలి

● ఎస్ఎఫ్ఐ నిరసన



కోతిరాంపూర్‌లో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్నఎస్ఎఫ్ఐనాయకులు

భగత్‌నగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాస్త్రీయ విద్యా విదానం అమలు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ రజనీకాంత్, టి నాగరాజులు అన్నారు. గురువారం నగరంలోని కోతిరాంపూర్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో యుజిసి గైడ్‌లైన్స్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుజిసి విడుదల చేసిన ఆదిమ, అశాస్త్రీయ అభ్యాస ఫలితాల అధారిత పాఠ్యప్రణాళిక చట్టాన్ని (ఎల్ఓసిఎఫ్) రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పూజ, కిరణ్, శంకర్, మమత, గజ్జెల శ్రీకాంత్, ప్రశాంత్, అరవింద్, విగ్నేష్, భారత్, తారసింగ్, రాజు, లెనిన్, ఆది, రాజేష్, శ్రీజ, ప్రశాంత్, అభినవ్, అభి తదితరులుపాల్గొన్నారు.

ఆలయాల జీర్ణోద్ధరణకు
మోక్షమెప్పుడో?

● నిత్యం రద్దీతో దేవాలయాలు
● అసౌకర్యాలతో భక్తుల ఇబ్బందులు



దూలూరులో శిథిలావస్థకు చేరిన శివాలయం

కథలాపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వందలాది సంవత్సరాల కిందట నిర్మితమైన ఆలయాలు జీర్ణోద్ధరణకు నోచుకోలేకపోతున్నాయి. ప్రతీదినం భక్తుల తాకిడితో సందడిగా ఉండే ఆలయాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ఉండడంతో అసౌకర్యంగా ఉంటోందని పలువురు పేర్కొంటున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా శిథిలావస్థలో ఉన్న ఆలయాలను మరమ్మతులు చేయించడంలో విఫలమవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని దూలూరులో శివాలయం, కలికోటలో త్రికూటేశ్వరస్వామి, భూషణరావుపేటలో వేణుగోపాలస్వామి, అంబారిపేటలో రాజరాజేశ్వరస్వామి ఆలయాలు శాతవాహనుల కాలంలో నిర్మించబడ్డాయని స్థానికులు చెబుతున్నారు. రాతి కట్టడాలతో పూర్తిగా వాస్తుదోష నివారణతో, ఎంతో ఆకర్షణీయంగా నిర్మించారు. పురాతన ఆలయాలు కావడంతో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తుంటారు. ప్రతీ ఏటా శివరాత్రి సందర్భంగా జాతరలు నిర్వహిస్తుంటారు. అయితే ఆలయాల వద్ద సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పూజారులకు కనీస వేతనం కూడా అందడం లేదు. ఏళ్ల తరబడి స్వామివారికి పూజలు చేస్తూనే కాలం గడపాల్సి వస్తోందని, దూప, దీప నైవేద్యాలకు కూడా నోచుకోవడంలేదని వాపోతున్నారు. జాతర సందర్భాల్లో గ్రామస్థులంతా కలిసి విరాళాలు పోగుచేసుకుని కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఆరు నెలల కిందట సిరికొండలోని పురాతన ఆలయ నిర్మాణం కోసం దేవాదాయ శాఖ 50 లక్షల రూపాయలు కేటాయించింది. మిగిలిన ఆలయాలకు కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాల భక్తులు కోరుతున్నారు.

అరవై ఏళ్లుగా పూజలు చేస్తున్నా..

- పులికాంత శాంతయ్య, పూజారి, దూలూరు



వందల ఏళ్ల కిందట గ్రామ నడిబొడ్డున నిర్మించిన శివాలయంలో అరవై ఏళ్లుగా స్వామివారికి పూజలు చేస్తున్నా. ప్రతీదినం స్వామి సన్నిధిలోనే ఉంటూ పూజాదికాలు నిర్వహిస్తున్నాను. దూప, దీప నైవేద్యాల కింద ఈ అలయాన్ని గుర్తించలేదు. ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. నూతన ఆలయాన్ని నిర్మించడానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తే కొత్త కళ వస్తుంది.



కలికోటలో త్రికూటేశ్వర స్వామి ఆలయం

రేపు రేవా రౌండ్ టేబుల్ సమావేశం

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (రేవా) ఉమ్మడి కరీంనగర్ జిల్లా రౌండ్ టేబుల్ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు రేవా కన్వీనర్ కోహెడ చంద్రమౌళి తెలిపారు. స్థానిక కరీంనగర్ ఫిలింభవన్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు జరుగుతుందని పేర్కొన్నారు. 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు అందలేదని, సంవత్సరన్నర కాలంగా పెన్షన్ తప్ప ఏవీ అందక పోవడంతో మానసిక క్షోభకు గురి అవుతున్నామని చెప్పారు. సమావేశాన్ని ఉమ్మడి జిల్లాలోని రిటైర్డు ఉద్యోగులు విజయవంతం చేయాలని కోరారు.

పోస్టల్ ఉద్యోగులకు దసరా బోనస్ ప్రకటించాలి

హుజూరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ ఉద్యోగులకు దసరా బోనస్ ప్రకటించాలని ఏఐపీఈయూ గ్రూప్-సీ రాష్ట్ర అధ్యక్షుడు ఊకంటి మహేందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ఎంతో ఘనంగా జరుపుకునే దసరా పండుగకు రైల్వే ఉద్యోగులకు కేంద్రం ప్రకటించిన విధంగానే తపాలా ఉద్యోగులకు బోనస్ ప్రకటించాలని కోరారు. బకాయిలు చెల్లించాలన్నారు.

విశ్వవిద్యాలయాలు నాణ్యమైన విద్యను అందించాలి

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ● 'శాతవాహన'లో వసతి గృహాలకు శంకుస్థాపన

కరీంనగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విశ్వవిద్యాలయాలు నాణ్యమైన విద్యను అందించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం బాలికల హాస్టల్ ప్రాంగణంలో మహిళలు, పురుషుల (ఎస్టీ) వసతి గృహాలకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ, గిరిజన బిడ్డల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో 20 కోట్ల విలువైన రెండు హాస్టల్ భవనాలను నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. దీంతో ఆదివాసీ, గిరిజన విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం సమకూరుతుందని తెలిపారు.

ప్రజాపాలనలో ఎన్నో మార్పులు
- మంత్రి పొన్నం ప్రభాకర్

బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజాపాలన నాయకత్వంలో ఎన్నో మంచి మార్పులు వచ్చాయన్నారు. జిల్లాలో విద్య, వైద్య సౌక ర్యాలు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ పెడు తున్నామన్నారు. యూజీసీ గ్రేడింగ్, న్యాక్, ఏఐసీటీఈ మార్గదర్శకాలను అనుసరించి నాణ్యమైన విద్యను అందించడానికి అధ్యాపకులు కష్టపడాలన్నారు. భవిష్యత్తు తెలంగాణను అభివృద్ధి దిశలో తీసుకెళ్లి పిల్లల భవి ష్యత్తును తీర్చిదిద్దాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు చొరవ చూపిస్తోందన్నారు. పాలక వర్గ సహకారంతో నాణ్యమైన విద్యను అందించడానికి, విశ్వవిద్యాలయాన్ని అన్ని రంగాలలో ముందు నిలిపి లక్ష్యసాధనకు కృషి చేస్తామన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ నాణ్యమైన విద్యతోనే విద్యార్థులు మంచి ఉద్యోగాలు సంపాదించుకుంటారన్నారు. విశ్వవిద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు సరిగ్గా ఉంటేనే నాణ్యమైన విద్య విద్యార్థులకు అందుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, మున్సిపల్ కమి షనర్ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, ఓఎస్డీ టు వీసీ డాక్టర్ బి హరికాంత్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ రమాకాంత్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుజాత, విశ్వవిద్యాలయ చీఫ్ వార్డెన్ డాక్టర్ మనోహర్ పాల్గొన్నారు.



శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న మంత్రులు పొన్నం, అడ్లూరి తదితరులు

వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం



రాజన్న ఆలయంలో కూష్మాండ అవతారంలో



ధర్మపురిలో శాకాంబరీ రూపంలో



కొండగట్టులో కాత్యాయని అవతారంలో

వేములవాడలో కూష్మాండ రూపం..

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో దేవీనవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రాజన్న ఆలయంలో అమ్మవారికి 11రోజులపాటు 11 అవతరాల్లో భక్తులకు దర్శనమివ్వనుంది. నాలుగో రోజు గురువారం రోజున అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు కూష్మాండ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ధర్మపురిలో శాకంబరి రూపంలో...

ధర్మపురి : ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి అనుబంధ రామలింగేశ్వర స్వామిఆలయంలో దేవినవరాత్రోత్సవాలు నాలుగోరోజు గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారు కూష్మాండ శాకంబరి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జుక్కు రవీందర్, భక్తులు పాల్గొన్నారు

కొండగట్టులో కాత్యాయనిగా ..

మల్యాల : కొండగట్టు అంజన్న సన్నిధిలో జరుగుతున్న దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా నాలుగవరోజు గురువారం అమ్మవారు కాత్యాయని అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారినికి కృషి చేస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం రేషన్‌డీలర్ల సంఘం నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రికి కమిషన్ ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదన్నారు. కమిషన్ డబ్బులు ఇవ్వకుండా పండుగ పూట రేషన్‌డీలర్లను ఎందుకు గోసపెడుతున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదనలు పంపక పోయినా కేంద్ర ప్రభుత్వం అడ్వాన్సుగా 2025-26 సంవత్సరానికి మ్యాచింగ్‌గ్రాంటు కింద రూ.11.70కోట్లు అందించిందన్నారు. ఈనెల17న జరిగిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వమ్యాచింగ్ గ్రాంటు విషయం చర్చకు వచ్చిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మ్యాచింగ్ గ్రాంట్ అందించి రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించి, కమిషన్ డబ్బులు ఇవ్వాలని కోరారు.



కేంద్ర హోం శాఖసహాయ మంత్రికి వినతిపత్రం అందిస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

ప్రాజెక్టుల నుంచి భారీగా నీటి విడుదల



ఎల్లంపల్లి నుంచి విడుదల అవుతున్న నీరు

● **శ్రీరాంసాగర్ నుంచి మూడు లక్షల క్యూసెక్కులు దిగువకు..**

జగిత్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు వరద నీరు రావడం గురువారం కొనసాగింది. 39 గేట్లు పైకి ఎత్తి మూడు లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 3,05,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 60.706 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

● **ఎల్లంపల్లికి భారీగా వరద..**

అంతర్గాం : మండల పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో, కడెం ప్రాజెక్టు నుంచి 4,144 క్యూసెక్కులు, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి 3.41లక్షల క్యూసెక్కులు, వాగులు, వంకల నుంచి 2.68లక్షల కూసెక్కులు మొత్తం 6.14లక్షల క్యూసెక్కుల వరద నీరు పోటెత్తుతుంది. ఎగువ నుంచి ఇంకా వరద నీరు వచ్చే అవకాశం ఉన్నందున గురువారం ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులు 40గేట్లు ఎత్తి 6.35లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన గల గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 20టీఎంసీలకు గాను ప్రస్తుతం 15.75టీఎంసీల నీరు నిల్వఉంది. ప్రాజెక్ట్‌వద్ద ఈఈ రవీంద్రచారి ఆధ్వర్యంలో అధికారులు ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉంటూ వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రాజెక్ట్ మీద నుంచి అంతర్గాం, మంచిర్యాలకు రాకపోకలను ప్రాజెక్ట్ అధికారులు నిలిపివేశారు.

● **మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో**

బోయినపల్లి : శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి(మిడ్ మానేరు) ప్రాజెక్టుకు గురువారం 5000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దిగువకు 3గేట్ల ద్వారా 6000 క్యూసెక్కులు, ప్యాకేజీ 9 లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కులు నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.87 ఉండగా, సామర్థ్యం 27,55 టీఎంసీలకు 27.222 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

● **ఎల్ఎండీలోకి వరద నీరు..**

తిమ్మాపూర్ : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా దిగువ మానేరు జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. గురువారం సాయంత్రం 6గంటల సమయం వరకు ఎల్ఎండి స్పీల్ వే ఆరు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు ఎల్ఎండిలోకి ఇన్‌ఫ్లోలు పెరుగుతుండటంతో 6గంటలకు మరో 2గేట్లు ఎత్తి మొత్తం 8 స్పీల్‌వే గేట్ల నుంచి 12వేల క్యూసెక్కుల నుంచి 20వేల క్యూసెక్కుల పెంచి దిగువకు నీటిని విడుదల చేశారు. మొత్తం 18,550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోలు ఎల్ఎండిలోకి వస్తుండగా 20వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లకు నేడు చివరి తేదీ

గణేష్‌నగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు శుక్రవారం 26 చివరి తేదీ అని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మి, కో-ఆర్డినేటర్ డాక్టర్ మనోజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి ఇంటర్మీడియెట్ ఓపెన్ స్కూల్, ఐటీఐ, డిప్లమా విద్యార్థులు టీఎస్ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇతర వివరాలకు 7382929755 నంబరులో సంప్రదించాలని సూచించారు.

శివలింగాన్ని హత్తుకున్న వానరం



శివలింగం వద్ద వానరం

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన శ్రీభీమేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఒక అరుదైన దృశ్యం చోటు చేసుకుంది. భీమేశ్వర ఆలయ వందుభాగంలో ఉత్తర ముఖంగా వున్న శివలింగంను ఓ వానరం హత్తుకుని కనిపించింది. శివలింగం ముందు ప్రణమిల్లినట్లు కొద్ది సేపటి వరకు శివలింగం వద్దనే ఉన్న దృశ్యం స్థానిక భక్తులను ఆశ్చర్యానికి గురిచేసింది.

అధ్వానంగా వ్యవసాయ మార్కెట్ రోడ్డు

● గుంతలు పడి... ప్రమాదకరంగా మారి..
● పట్టించుకోని అధికారులు
● వాహనదారుల ఇబ్బందులు

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ రోడ్డు అధ్వానంగా మారింది. వర్షాలకు గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాలతో పాటు, ఆటోలు, ట్రాలీలు నిత్యం వ్యవసాయ మార్కెట్‌కు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ గుంతల రోడ్డుపై ప్రయాణం చేస్తుండడంతో అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ మార్కెట్‌లో కరీంనగర్ వ్యవసాయ సహకారం సంఘంతో పాటు, మండల వ్యవసాయ కార్యాలయం ఉన్నాయి. ఇందులోనే రైతులకు ఎరువులను పంపిణీ చేస్తారు. మార్కెట్‌లో ప్రస్తుతం పండ్ల వ్యాపారం నిత్యం కొనసాగుతోంది. లారీలతోపాటు, ఆటోల్లో పండ్లను కొనుగోలు చేసి తీసుకెళ్తారు. ఇదే రహదారిలో నివాసాలు, పలు దుకాణాలు కూడా ఉన్నాయి. ఈ విషయంపై అధికారులు దృష్టిసారించాలని, వెంటనే మరమ్మతు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌కు వెళ్లే రోడ్డు



రోడ్డుపై ఏర్పడిన గుంతలు, నిలిచిన నీరు

ప్రమాదకరంగా కరీంనగర్-జగిత్యాల రోడ్డు

● గుంతలతో ప్రయాణికుల ఇక్కట్లు ● పట్టించుకోని అధికారులు

కొడిమ్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూరు వద్ద కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారి గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు ఈ రోడు పై రాకపోకలు సాగిస్తాయి. మూల మలుపు వద్ద గుంతలు పడటంతో రాత్రి వేళల్లో వాహనాలు నడపటం కష్టంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. రాత్రి సమయంలో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు రోడ్డు దిగటంతో అదుపుతప్పి కిందపడడంతో గాయాలపాలైనట్లు పూడూర్ గ్రామస్థులు తెలిపారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కొడిమ్యాల మండలం పూడూరు వద్ద గుంతలు పడ్డ రోడ్డు

జడ్పీ చైర్మన్ పదవిపై ఉత్కంఠ!

(5వ పేజీ తరువాయి)

కాంగ్రెస్‌పార్టీతో పాటు బీఆర్‌ఎస్, భారతీయ జనతాపార్టీలకు చెందిన నాయకులు తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు తీవ్రంగా శ్రమించనున్నారు. సాధారణంగా రాష్ట్రంలో ఏపార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకే స్థానికసంస్థల ఎన్నికల్లో మెజారిటీ సీట్లు దక్కుతాయి. ఒకవేళ జడ్పీచైర్మన్ పదవి జనరల్‌కు కేటాయిస్తే మంథని, అంతర్గాం, ఎలిగేడు, సుల్తానాబాద్, పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, రామగిరి, కమాన్‌పూర్, ముత్తారం మండలాల నుంచి గెలుపొందే వాళ్లు జడ్పీచైర్మన్ అయ్యేందుకు ఆస్కారం ఉంటుంది. అయితే మహిళలకు 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్న దృష్ట్యా జడ్పీచైర్మన్ పదవిని మహిళలకు కేటాయిస్తే మహిళలకు చైర్మన్ పదవి దక్కనున్నది. జనరల్‌కు కేటాయిస్తే పురుషులతోపాటు మహిళలు కూడా చైర్మన్ అయ్యేందుకు అవకాశం ఉంది. ప్రభుత్వం అధికారికంగా రిజర్వేషన్లు ప్రకటించే వరకు ఉత్కంఠ కొనసాగుతూనే ఉంటుంది.

ఆదివరాహస్వామి హుండీ ఆదాయం రూ.7.61లక్షలు

కమాన్‌పూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆదివరాహస్వామి ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు చేపట్టారు. దేవాదాయశాఖ పరిశీలకుడు సత్యనారాయణ, ఈవోకాంతారెడ్డి ఆధ్వర్యంలో పలుశాఖల అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. ఇందులో మార్చి26నుంచి సెప్టెంబరు 25 వరకు జరిగిన వేడుకల్లో స్వామివారికి రూ.7,61,764 వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. ఇందులో ఉగాది, శ్రీవరాహస్వామి జన్మదిన వేడుకల హుండీలు కూడా కలిపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీనృసింహ సేవాట్రస్టు కార్యదర్శి ప్రేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తా

● మనాలి ఠాకూర్

పాలకుర్తి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని పుట్నూర్, కుక్కలగూడూర్ గ్రామాల్లో బుధవారం రాత్రి మక్కాన్‌సింగ్ సేవాసమితి చైర్‌పర్సన్ మనాలి ఠాకూర్ సందర్శించారు. పుట్నూర్‌లో ఇటీవల కురిసిన వర్షానికి రావుల పున్నం ఇంటి మట్టిగోడ కూలడంతో కుటుంబసభ్యులను పరామర్శించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేపిస్తానని హామీ ఇచ్చారు. ఆయా గ్రామాల్లో నెలకొల్పిన దుర్గామాత మండపాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. బతుకమ్మ ఆడారు. కుక్కలగూడూర్ మాజీఎంపీటీసీ సీపతి శంకరయ్య అనారోగ్యానికి గురై మంచానికే పరిమితం కాగా ఆయనను మందలించి మెరుగైన చికిత్స చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆమెవెంట పాలకుర్తి మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, కాంగ్రెస్ గ్రామశాఖల అధ్యక్షులు బోరె లచ్చయ్య, మేడం బాపు, తోట ప్రశాంత్, మాదాసు శ్రావణ్‌గౌడ్ తదితరులున్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



మంథనిలో బతుకమ్మ ఆడుతున్న జడ్జి భవాని, మహిళా న్యాయవాదులు



కలెక్టరేట్‌లో ఉద్యోగుల బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాకలెక్టరేట్‌లో గురువారం రాత్రి బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆధ్వర్యంలో పలువురు కార్యాలయ ఉద్యోగులతోపాటు సిబ్బంది, ఆయాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.ం ామగుండం ఎమ్మెల్యేఠాకూర్ మక్కాన్ సింగ్, టీఎన్జీవో అధ్యక్షుడు బొంకూరి శంకర్, జిల్లా అధికారులు పాల్గొని బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.

కోర్టు ఆవరణలో..

మంథని: బతుకమ్మవేడుకలను స్థానికకోర్టు ప్రాంగణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మంథని సీనియర్ సివిల్‌జడ్జి వీ భవాని, కోర్టు ఉద్యోగులు, మహిళాన్యాయవాదులు శ్రీలక్ష్మి, బండమాధురి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి రఘోత్తంరెడ్డి, ప్రధానకార్యదర్శి ఎం సహేందర్‌రెడ్డి, గ్రంథాలయకార్యదర్శి కటకం శ్రీనివాస్, ఏజీపీ అంజనే యులు, సదన్‌కుమార్, శశిభూషణ్ కాచే, మంథనిశ్రీనివాస్, వ్యాస్ కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ: తెలంగాణ ఆత్మగౌరవప్రతీక బతుకమ్మ పండుగ అని రామగుండం ఎమ్మెల్యే దంపతులు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మనాలీఠాకూర్ అన్నారు. గురువారంరాత్రి రామగుండం ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. మహిళలతోకలిసి బతుకమ్మఆడారు. కార్యక్రమంలో ఆర్‌జీ-1 సేవాసమితి అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్, మహిళకాంగ్రెస్ నాయకురాళ్లు దాసరి ఉమాదేవి, జనగామ స్వప్న, సుశీల పాల్గొన్నారు.

శ్రీవాణి కళాశాలలో..

సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీవాణి విద్యాసంస్థల్లో గురువారం బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల డైరెక్టర్ రేకులపల్లి సుష్మ మాట్లాడుతూ ఈతరం విద్యార్థులకు మనసంస్కృతి సాంప్రదాయాలు తెలిజేయడం ముఖ్యమని అన్నారు. ఆకర్షణీయంగా బతుకమ్మలు తయారు చేసిన విద్యార్థులకు బహు మతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ రేకులపల్లి శశాంక, ప్రిన్సిపాళ్లు బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో..

కమాన్‌పూర్: మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో గురువారం వైద్యసిబ్బంది, మహిళలు బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. వేడుకల్లో బాల భారతి, ఇందిరా, శైలజ, శ్యామల, శ్రీలత, కృష్ణవేణి, మల్లీశ్వరి, పుష్పలత, కృష్ణవేణి, పుష్పలత, హేమలత, శ్రీలత, సునీతతోపాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో..

గోదావరిఖని: బతుకమ్మ వేడుకల్లో భాగంగా గురువారం ఆర్‌జీ-1 జీఎం కార్యాలయ ఆవరణలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులు, మహిళలు పెద్ద ఎత్తున ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్, సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్ హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సీఎంవోఏఐ ప్రతినిధి క్రాంతి కుమార్, ఏఐటీయూసీ ప్రతినిధి రాజు, డీజీఎం(ఫైనాన్స్) ధనలక్ష్మిబాయి, పర్చేస్ అధికారి బీమా, డీవైపీఎం వేణు, సీనియర్ పీఓ హనుమంతరావు పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు అధ్యాపకులు



బతుకమ్మ ఆడుతున్న మనాలీ ఠాకూర్



బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగులు, మహిళలు

గ్రూప్-1 ఫలితాల్లో మెరిసిన ఖని యువతి

● ఎంపీడీవోగా అంజుమ..



మార్కండేయకాలనీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (ఎంపీడీవో)గా గోదావరిఖని జీఎంకాలనీకి చెందిన అంజుమ ఎన్నికయ్యారు. ఇటీవల నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలు బుధవారం విడుదల కాగా అంజుమ ఎంపీడీవోగా ఎన్నికైంది. 10వ తరగతి వరకు గోదావరిఖనిలో చదివిన అంజుమ ఇంట ర్మీడియట్ ఆల్ఫోర్స్‌లో, సెంటినరీకాలనీ జేఎన్‌టీయూసీ లో బీటెక్ పూర్తి చేసింది. కాగా అంజుమ తండ్రి మహమూద్ సింగరేణి ఆర్‌జీ-2 ఎస్‌అండ్‌పీలో క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. తల్లి షాహెద గృహిణి. ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో అంజుమ ఎంపీడీవోగా ఎన్నిక కావడంపట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. కాగా ఇటీవల నిర్వహించిన సివిల్స్ పరీక్షల్లో సైతం అంజుమ ఇంటర్వ్యూ వరకు వెళ్లింది.

సివిల్స్ సాధించడమే లక్ష్యం..అంజుమ

సివిల్స్ సాధించడమే లక్ష్యంగా రెండేళ్లుగా సిద్ధమవుతున్నా. ప్రిపరేషన్‌లో ఉండగానే గ్రూప్-1 నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేసుకున్నాను. బుధవారం వెలువరించిన ఫలితాల్లో ఎంపీడీవోగా ఎంపికయ్యాను. ఎంతో సంతోషాన్ని కలిగిస్తుంది. భవిష్యత్‌లో సివిల్స్ సాధించడమే లక్ష్యం.

● అసిస్టెంట్ ట్రెజరర్‌గా శివశంకర వరప్రసాద్..



కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1పరీక్షలో పెద్దపల్లిజిల్లా గోదావరిఖనికి చెందిన తుంగపిండి శివశంకర వరప్రసాద్ అసిస్టెంట్‌ట్రెజర్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించాడు. గురువారం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫలితాలను వెల్లడించింది. శివశంకరవర ప్రసాద్ తండ్రి తుంగపిండి ఆనంద్ సింగరేణి ఓసీపీ-1లో ఈపీ ఆపరేటర్ విధులు నిర్వహిస్తు న్నాడు. శివశంకర వరప్రసాద్ విద్యాభ్యాసం ఎన్‌టీపీసీలోని సచ్‌దేవ స్కూల్‌లో ఫస్ట్‌క్లాస్ నుంచి 8వతరగతి వరకు కొనసాగింది. ఆతరువాత హైదరాబాద్‌లో చదివిన వరప్రసాద్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశాడు. ప్రస్తుతం లా చదువుతున్నాడు. వరప్రసాద్‌కు గ్రూప్-1లో ఉద్యోగం రావడంపట్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. అలాగే సింగరేణి ఉద్యోగి తుంగపిండి ఆనంద్ కుమారుడు గూప్-1లో ఉద్యోగం సాధించడం పట్ల సింగరేణి అధికారులు, తోటి ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

● అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా శ్రీరాంరెడ్డి..



జ్యోతినగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రూప్1ఫలితాలకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో ఎన్టీపీసీ కృష్ణానగర్‌కు చెందిన ముద్దసాని శ్రీరాంరెడ్డి ఎక్సైజ్‌శాఖలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ పోస్టును సాధించాడు. ఎన్టీపీసీ ప్రాంతంలో వ్యాపారిగా ఉన్న ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి పెద్ద కొడుకు శ్రీరాంరెడ్డి గ్రూప్1 పరీక్షలో 144వర్యాంకు సాధించాడు. తాజాగా ప్రభుత్వం ఆయా ర్యాంకులకు సంబంధించి అభ్యర్థులకు పోస్టుల జాబితాను విడుదల చేసింది. ఈమేరకు శ్రీరాంరెడ్డి ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పోస్టుకు ఎంపికయ్యాడు. శ్రీరాంరెడ్డి 1నుంచి 10వతరగతి ఎన్టీపీసీ టీటీఎస్‌లోని సచ్‌దేవ స్కూల్‌ఆఫ్ ఎక్సలెన్స్‌లో చదివాడు. ఇంటర్మీడియెట్ హైదరాబాద్‌లోని ఎఫ్ఐఐటి జెఈఈ కాలేజీలో చదివాడు. నిట్ వరంగల్‌లో బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. పోటీపరీక్షలు ప్రిపేర్ అయిన శ్రీరాంరెడ్డి రాష్ట్ర ప్రభుత్వం 2024అక్టోబరులో నిర్వహించిన గ్రూప్1పరీక్షరాసి144వర్యాంకు సాధించాడు.

ప్రణాళికాబద్ధంగా చదివాను..- శ్రీరాంరెడ్డి

గ్రూప్1పోటీపరీక్షకు సంబంధించి ప్రణాళికాబద్ధంగా ప్రిపేర్ అయ్యాను. అంతకుముందు యూపీఎస్సీ కోసంచేసిన ప్రిపరేషన్ నాకుఎంతో ఉపయోగపడింది. గ్రూప్1విషయంలో రోజుకు 4గంటలపాటు ప్రిపేర్ అయ్యాను. భవిష్యత్‌లో యూపీఎస్సీర్యాంకు సాధించేందుకు ప్రయత్నం సాగిస్తాను.

గొప్ప ఆర్థిక, సామాజిక వేత్త దీన్‌దయాల్ ఉపాధ్యాయ



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారతదేశ గొప్ప సామాజిక, ఆర్థికవేత్త దీన్‌దయాల్ ఉపాధ్యాయ అని బీజేపీ పెద్దపల్లి జిల్లాకార్యదర్శి సోమారపు లావణ్య అన్నారు. దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా గురువారం శివాజీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుల్వ లక్ష్మీనర్సయ్య, మహవాది రామన్న, అరుణ్‌కుమార్, చంద్రశేఖర్, సునీల్, శ్రావణ్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యరాణి లక్ష్మీనగర్‌లో మొక్కలు నాటారు. బీజేపీకి పునాదులు వేసిన మహానేత దీన్‌దయాల్ ఉపాధ్యాయ అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీనాయకులు మేరుగు హన్మంతుగౌడ్, ముస్కుల భాస్కర్‌రెడ్డి, అపర్ణ, కోడూరి రమేష్, శ్రీనివాస్, ఐలయ్య, హిమాన్షు, ప్రణీత్, రాహుల్ పాల్గొన్నారు.

జూలపల్లి: మండలకేంద్రంలో గురువారం పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతివేడుకలను మండలబీజేపీ అధ్యక్షుడు కొప్పులమహేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుడిపాటి సంతోష్‌రెడ్డి, నల్ల గంగారెడ్డి, వేంసాని కొమురయ్య, బెజ్జంకి రమేష్, పొట్యాల సందీప్, రాజిరెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హ్యాకథాన్ వినూత్న ఆలోచనలకు వేదిక

● జేఎన్టీయూ ప్రిన్స్‌పాల్: విష్ణువర్ధన్

రామగిరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): హ్యాకథాన్ విద్యార్థుల వినూత్న ఆలోచనలకు వేదిక కానుందని జేఎన్టీయూ ప్రిన్స్‌పాల్ విష్ణు వర్ధన్ అన్నారు. గురువారం కళాశాలలో నిర్వహించిన అంతర్గత హ్యాకథాన్‌ను ప్రిన్స్‌పాల్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ వంటి జాతీయస్థాయి పోటీలు విద్యార్థులు సృజనాత్మకతను పెంచడమే కాకుండ వినూత్న ఆలోచనలకు వేదికగా మారనుందని పేర్కొన్నారు. మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు అంతర్గతంగా హకథాన్ పోటీలు నిర్వహించి ఎంపికైన విద్యార్థులను రాష్ట్రస్థాయి హకథాన్‌కు పంపిస్తామన్నారు. ఈ సందర్భంగా హ్యాకథాన్‌లో 21టీంలు పాల్గొని తమ కొత్త నవకల్పనలపై ప్రెజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కుమార్, కొ-ఆర్డినేటర్ ఆజ్మీర నరహరి, ఆర్గనైజర్స్ వంశీకృష్ణ, సాయిదీక్షిత్, శివకృష్ణ, శ్రీధర్, దేవేంద్రచారి, రాజు, సంజన పాల్గొన్నారు.

కాత్యాయని అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



కాత్యాయని అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మార్కండేయకాలనీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దుర్గాదేవి నవరాత్రుల్లో భాగంగా 4వ రోజు గురువారం అమ్మవారు కాత్యాయని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పది సంవత్సరాలకు ఒక సారి ప్రత్యేకంగా కాత్యాయని దేవి మహిమణి అమ్మవార్లు దర్శనమిస్తారు. గోదావరిఖని అశోక్‌నగర్‌లోని అమ్మ దళం ఆధ్వర్యంలో కాత్యాయని దేవికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమలో ఓదెల లత, రవికుమార్, మాచిడి మహేందర్, ఓదెల రక్షిత్ పాల్గొన్నారు. జవహర్‌నగర్‌లోని జయదుర్గాదేవి ఆలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ ప్రత్యేకపూజలు నిర్వహించగా, పవర్‌హౌస్‌కాలనీలో, గనులపై కార్మికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కనుకుల దుర్గామాతకు ప్రత్యేక పూజలు..

సుల్తానాబాద్: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కనుకుల గ్రామంలో దుర్గాదేవి మండపంలో గురువారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి తదితరులు దుర్గామాతకు పూజలు నిర్వహించగా, మండప నిర్వాహకులు, కనుకుల సింగిల్‌విండో వైస్‌చైర్మన్ కొమ్మిడి వెంకట్రామిరెడ్డి సురేష్ రెడ్డిని సత్కరించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీడైరెక్టర్ కాందూరి వాసు, శశివర్ధన్, అనిల్, శ్రీకాంత్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణదేవి అలంకరణలో..

ఎలిగేడు: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సుల్తాన్‌పూర్‌లో భవాని యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారిని అన్నపూర్ణ మాతా రూపంలో కొలిచారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అన్నదానం చేశారు. మహిళలు దీపారాధన చేశారు. భవాని దీక్షాపరులు శ్రీకాంత్, ప్రీతం, సాయి, సన్ని, రాకేష్, హరీష్, అనిల్, శేఖర్, భక్తులు మంద స్వామి, అజయ్, పెద్దకురుమ శేఖర్, సతీష్, శ్రీరామ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మండల ప్రజలు సుభిక్షంగా ఉండాలి..

పాలకుర్తి: మండలం పరిధిలోని రాణాపూర్ గ్రామంలో నెలకొల్పిన దుర్గామాతను కన్నాల ప్యాక్స్ చైర్మన్ బయ్యపు మనోహర్ రెడ్డి గురువారం దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. మండల ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయకమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు.

సేవా పక్వాడ ఆధ్వర్యంలో సామాజిక సేవలు



మొక్కలు నాటుతున్న బీజేపీనాయకులు మనోహర్‌రెడ్డి, ప్రవీణ్

సుల్తానాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సేవాపక్వాడ అభియాన్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు పక్వాడకమిటీ కన్వీనర్ నల్ల మనోహర్‌రెడ్డి, మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని మండలంలోని కనుకుల గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, వడ్లకొండ శశివర్ధన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దీన్‌దయాల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో పెద్దమ్మ తల్లి ఆలయ ఆవరణలో కన్వీనర్ నల్ల మనోహర్ రెడ్డి, కోకన్వీనర్ మిట్టపల్లి ప్రవీణ్, బీజేపీజిల్లా ఉపాధ్యక్షుడు చౌదరిమహేందర్ యాదవ్‌తోకలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చాతరాజు రమేష్, ఎల్లెంకి రాజు, కోట నాగేశ్వర్, ఎర్రం సంతోష్‌రెడ్డి, కొమ్మిడి రాజేందర్‌రెడ్డి, భూసారపు సంపత్, యెల్లయ్య, శేఖర్ మాస్టర్, ఆకుల లక్ష్మణ్, చిట్టవేని సదయ్య, సలిగంటి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి

ధర్మారం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి జరుగుతోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. రామయ్యపల్లిలో జీపీ భవనాన్ని ప్రారంభించారు. నర్సింహులపల్లి గ్రామంలో దుర్గమాతను దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఖిలావనపర్తి గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో 10లక్షల రూపాయలతో నిర్మించతలపెట్టిన కిచెన్ షెడ్డుకు భూమి పూజచేశారు.

హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడిగా అనుమ భద్రయ్య



అనుమ భద్రయ్య

కోల్‌సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎఫ్‌సీఐ ఏరియాకు చెందిన బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కోఆపరేటివ్ హౌసింగ్‌సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడిగా అనుమ భద్రయ్య ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కోఆపరేటివ్ ఎలక్షన్ అథారిటీ అదనపు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు. సెప్టెంబరు22, 23తేదీల్లో జరిగిన ఎన్నికల్లో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యక్షుడిగా ఏ మల్లయ్య, కార్యదర్శిగా కేవీరావు, కోశాధికారిగా టీ శంకరయ్య, మేనేజింగ్ కమిటీ కే వైకుంఠం, రామస్వామి, ఎస్ సత్యనారాయణ, టీ విజయలక్ష్మిను ఎన్నుకున్నారని, ఈపాలకవర్గం 2030సెప్టెంబర్ వరకు కొనసాగుతుందని ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

మంథని, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన మెడికవర్ హాస్పిటల్, మంథని ప్రెస్‌క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం గురువారం విజయవంతమైంది. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పాత్రికేయులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజలు బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఏకో, ఇతర టెస్టులు చేయించుకున్నారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు, డాక్టర్ దీక్షత్‌లు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో మెడికవర్ ఆసుపత్రి హెడ్ గుర్ర కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, హరీష్, శ్రీనివాస్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అంకరి కుమార్, ప్రధానకార్యదర్శి పోతరాజు సమ్మయ్య, ఉపాధ్యక్షుడు బర్ల సంపత్, కోశాధికారి తరగం రాజు, సహాయ కార్యదర్శి గంధం అంజిబాబు, ప్రాతికుయులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో దసరా ఉత్సవాల ఏర్పాట్లకు ఆటంకం

కోల్‌సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూస్టేడియంలో నిర్వహించనున్న దసరాఉత్సవాల ఏర్పాట్లకు భారీవర్షాలు ఆటకంగా మారాయి. అక్టోబరు2 విజయదశమి సందర్భంగా ప్రతిఏటా దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈసారి నెలరోజుల ముందుగానే ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సింగరేణి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసారి సినీకళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. కానీ భారీవర్షాలు కురుస్తుండడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఈ పరిస్థితుల్లో గురువారం రాత్రి రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పోలీస్, సింగరేణి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సాధ్యాసాధ్యాలపై సమీక్ష జరిపారు.

గ్రేడ్-3 క్లర్కులుగా ఇచ్చేందుకు అంగీకారం

● డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో ఒప్పందం



ఒప్పందం చేసుకుంటున్న ఏఐటీయూసీ, సింగరేణి యాజమన్య ప్రతినిధులు

గోదావరిఖని, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో గని ప్రమాదంలో మరణించిన కార్మికుల పిల్లలను గ్రేడ్-3క్లర్కులుగా నియమించేందుకు యాజమాన్యం అంగీకరించిందని సింగరేణి కాలరీస్‌వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని రీజినల్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ చీఫ్‌లేబర్ కమిషనర్ సమక్షంలో యాజమాన్యంతో గుర్తింపుసంఘం ఏఐటీయూసీ జరిగిన ఒప్పందంపై సంతకాలు చేశారని ఆయన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక వివాదాల చట్టం 12(3) ప్రకారం త్రైపాక్షిక ఒప్పందం ప్రకారం గురువారం హైదరాబాద్‌లో డిప్యూటీచీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో యాజమాన్యం, గుర్తింపుసంఘం నాయకుల మధ్యన అధికారిక రాతపూర్వక ఒప్పందం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో యాజమాన్య ప్రతినిధులతోపాటు ఏఐటీయూసీ అదనపు ప్రధానకార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉప ప్రధానకార్యదర్శులు వైవీ రావు, మడ్డి ఎల్లాగౌడ్, కందికట్ల వీర భద్రం, ముష్కె సమ్మయ్య పాల్గొన్నారు.



ఫ్యామిలీడే సన్నాహక సమావేశం

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాలో నిర్వహించనున్న ఫ్యామిలీడే వేడుకల నిర్వహణపై గురువారం ఏరియా సేవాసమితి అధ్యక్షురాలు వనజా వెంకటయ్య గురువారం సేవా సభ్యులతో సమావేశమయ్యారు. 27న సీఈఆర్ క్లబ్‌లో జరిగే ఫ్యామిలీడే, బతుకమ్మ ఉత్సవాలకు మహిళా ఉద్యోగినులు, ఉద్యోగుల కుటుంబాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాధన్, సేవా ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

ఆర్జీ-2లో స్వచ్ఛతా ఉత్సవ్

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు స్వచ్ఛతా ఉత్సవ్ కార్యక్రమాన్ని గురువారం ఆర్జీ-2 యాజమాన్యం నిర్వహించింది. ఉత్సవంలో భాగంగా ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాథ్ పేరిట జీఎం ఆఫీస్ సమాపంలోని రోడ్డుకూడలి ప్రాంగణాన్ని అధికారులు శుభ్రం చేశారు. రోడ్డుకు ఇరువైపుల పెరిగిన తుమ్మలు, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈకార్యక్రమంలో ఎస్వోటూ జీఎం రాముడు, ఎన్విరాన్‌మెంట్ ఆఫీసర్ సురేష్‌బాబు, సేఫ్టీ ఆఫీసర్ సంతోష్‌కుమార్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్లు వేణుగోపాల్, వంశీధర్ పాల్గొన్నారు.

ఆర్జీ-1 ఏరియాలో స్వచ్ఛతా హీ సేవా

గోదావరిఖని, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతాహీ సేవాలో భాగంగా గురువారం పవర్‌హౌస్‌కాలనీలోని లైబ్రేరి ఆవరణలో చెత్తా చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీఎంఓఏఐ ప్రతినిధి క్రాంతికుమార్, ఎఐటీయూసీప్రతినిధి రాజు, ఇన్‌చార్జి ఎన్విరాన్‌మెంట్ అధికారి మల్లిఖార్జున్‌యాదవ్, సెక్యూరిటిఅధికారి వీరారెడ్డి, డీజీఎం(సివిల్)వరప్రసాద్, పర్చేస్ అధికారి బీమా, డీవైపీఎంవేణు, సీనియర్‌పీవో శ్రావణ్‌కుమార్, హనుమంతరావు పాల్గొన్నారు.

పీఎల్‌ఆర్ బోనస్‌పై ప్రతిష్ఠంబన

● నేడు ఖరారయ్యే అవకాశం

గోదావరిఖని, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఉన్న బొగ్గు గని కార్మికులకు పెర్ఫార్మెన్స్ లింక్‌డ్ రివార్డ్(పీఎల్‌ఆర్) బోనస్ చెల్లింపుపై ప్రతిష్ఠంబన కొనసాగుతున్నది. గురువారం కోల్‌కతాలో జాతీయకార్మిక సంఘాలు, కోల్‌ఇండియా యాజమాన్యంతో సుదీర్ఘంగా చర్చలు జరుగు తున్నాయి. పీఎల్‌ఆర్ బోనస్ రూ.1.15లక్షలు కార్మికులకు చెల్లించాలని సంఘాలు డిమాండ్ చేస్తుంటే బొగ్గు పరిశ్రమల యాజమాన్యాలు మాత్రం రూ.98వేలు చెల్లిస్తామని చెబుతున్నాయి. గురువారం రాత్రి 9గంటల వరకు కూడా ఈ చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం కల్లా బోనస్ ఖరారు అయ్యే అవకాశం ఉంది. ఈ చర్చల్లో పీఎల్‌ఆర్ బోనస్ లక్ష దాటే వరకు కార్మిక సంఘాలు పట్టుబట్టే అవకాశం ఉంది.